క్లుప్తంగా

ఆకట్టుకున్న సైన్స్ ప్రదర్శన



సైన్స్ ప్రదర్శనలను తిలకిస్తున్న అధికారులు

కోటనందూరు: స్థానిక జిల్లా పరిషత్ హైస్కూల్లో సోమవారం ఏర్పాటు చేసిన సైన్స్ ఎగ్జిబిషన్‌లో ప్రదర్శించిన సైన్స్ నమూనాలు అందరినీ ఆకట్టుకున్నాయి. ఈ ఎగ్జిబిషన్‌లో 10 ప్రభుత్వ, 3 ప్రైవేటు పాఠశాలల విద్యార్థులు పాల్గొని వివిధ సైన్స్ నమూనాలను ప్రదర్శించారు. విద్యార్థులు ప్రదర్శించిన ప్రదర్శనలను తహసీల్దార్ టి.సుభాష్, ఎంపీడీఓ పీ వెంకటనారాయణ, ఎంఈఓలు శ్రీనివాస్, రామశేఖర్ పరిశీలించారు. ఉత్తమ ప్రదర్శనలు ఇచ్చిన విద్యార్థులను అభినందించి బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం వేణుగోపాల్, సీఆర్పీ వెంకటగోవిందశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

కార్యాలయం ఎదుట కార్మికుల బైఠాయింపు

ఏలేశ్వరం: తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ తహసీల్దార్ కార్యాలయం వద్ద కార్మికులు బైఠాయింపు నిర్వహించారు. మండల పరిధిలోని చిన్నింపేట జీడి పిక్కల ఫ్యాక్టరీలో పని చేస్తున్న కార్మికులు నిరసనలు చేపట్టి సోమవారం నాటికి 45వ రోజుకు చేరుకుంది. ఆందోళనలో భాగంగా కార్మికులు తహసీల్దార్ కార్యాలయం వద్ద నిరసన తెలిపారు. కార్యాలయ సిబ్బంది లోపలికి పోకుండా అడ్డుకోవడంతో పోలీసులు వచ్చి కార్మికులను అడ్డుకున్నారు. దీంతో కాసేపు ఉద్రిక్తత పరిస్థితి నెలకొంది. కార్మికుల సమస్యలు పరిష్కరిస్తామని అధికారులు హామీ ఇవ్వడం ఆందోళన విరమించారు.

అమిత్ షాను పదవి నుంచి తొలగించాలి

కోటనందూరు: రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన కేంద్ర హోం మంత్రి అమిత్‌షాను తక్షణమే పదవి నుంచి తొలగించాలని సీఐటీయూ మండల శాఖ డిమాండ్ చేసింది. స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఆ మేరకు సోమవారం సీఐటీయూ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. అమిత్‌షా, కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అనంతరం తహసీల్దార్ సుభాష్‌కు వినతిపత్రం అందజేశారు.

జగ్గంపేట: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌పై పార్లమెంట్‌లో అనుచిత వాఖ్యలు చేసిన కేంద్ర మంత్రి అమిత్‌షాను తక్షణం ఆ పదవి నుంచి తొలగించాలని డిమాండ్ చేస్తు ఆంధ్రప్రదేశ్ రైతు కూలీ సంఘం సోమవారం ఆందోళన చేపట్టింది. జగ్గంపేట శివారు రంగవల్లి నగర్ వద్ద ర్యాలీ నిర్వహించారు.

గ్రీవెన్స్‌కు రెండు అర్జీలు

గండేపల్లి: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన గ్రీవెన్స్‌కు పింఛన్లు అందించాలని రెండు అర్జీలు అందినట్టు ఎంపీడీఓ నాతి బుజ్జి తెలిపారు. ఈ కార్యక్రమంలో పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

రబీ సాగు నిలిపివేయాలి

గోకవరం: సూరంపాలెం కాలువపై ఆధారపడి రబీ సాగు చేసుకునే రైతులు ఈ ఏడాది నిలిపివేయాలని మండల వ్యవసాయశాఖ అధికారి రాజరాజేశ్వరి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. సూరంపాలెం నుంచి నీటిని నిలుపుదల చేసిన నేపథ్యంలో రైతులు ఈ విషయాన్ని గమనించాలన్నారు. చెరువులు, బోర్లు ఉన్న రైతులు మాత్రం సాగు చేసుకోవాలన్నారు.

ఉద్యోగ నైపుణ్యానికి వర్క్‌షాపుల దోహదం

గండేపల్లి: వర్క్‌షాపులు ఉద్యోగ నైపుణ్యానికి దోహదపడతాయని డిప్యూటీ ప్రో ఛాన్సలర్ ఎం.శ్రీనివాసరెడ్డి అభిప్రాయపడ్డారు. సూరంపాలెం ఆదిత్య యూనివర్సిటీలో ఆరు రోజులపాటు నిర్వహించిన ఏపీఎస్‌ఎస్‌డీసీ శిక్షణ కార్యక్రమానికి చివరి రోజు సోమవారం ఆయన పాల్గొని మాట్లాడుతూ వర్క్‌షాపులు విద్యార్థుల నైపుణ్యాలను మెరుగుపరచి ఉద్యోగ సాధనను పెంపొందిస్తాయన్నారు. ఎలక్ట్రానిక్ రంగంలో వినియోగించే ప్రింటెడ్ సర్క్యూట్ బోర్డులు తయారీ, డిజైనింగ్, వినియోగించే పద్ధతి, వాటి నమూనాలు తయారు చేయించడంపై శిక్షణ ఇచ్చినట్టు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఏపీ రాష్ట్ర నైపుణ్య అభివృద్ధి శిక్షణా సంస్థకు చెందిన సీహెచ్ సంతోష్, ఏపీఎస్‌ఎస్‌డీసీ డీన్స్ జె.డి.వెంకటేష్, వి.సత్యనారాయణ, మనీషా, దుర్గ తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు చేయాలి

గోకవరం: అచ్యుతాపురం గ్రామ పంచాయతీ పరిధిలో రైతులు పండించిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలని పలువురు రైతులు సోమవారం మండల వ్యవసాయ శాఖ అధికారి రాజరాజేశ్వరికి వినతిపత్రం అందజేశారు. టార్గెట్ పూర్తయ్యిందనే సాకుతో తాము పండించిన ధాన్యాన్ని కొనుగోలు చేయకుండా నిలుపుదల చేయడంతో తామంతా తీవ్ర ఆందోళనకు గురౌతున్నామన్నారు. దీనిపై అధికారులు వెంటనే స్పందించి తమ ధాన్యాన్ని కొనుగోలు చేయాలని విజ్ఞప్తి చేశారు. ఎంపీటీసీ మాజీ సభ్యుడు నల్లల వెంకన్నబాబు, తదితరులు పాల్గొన్నారు.

నేటితో ముగియనున్న బీమా గడువు

తొండంగి: రబీలో వరి సాగు చేస్తున్న పంటలకు బీమా గడువు మంగళవారంతో ముగియనుంది. మండలంలోని వ్యవసాయబోర్ల పరిధిలో కొద్ది శాతం మినహా పీబీసీ, మిగిలిన ప్రాంతాల్లో వరినాట్లు వేయలేదు. పంట బీమా చెల్లింపు గడువు పెంచితే రైతులకు సౌలభ్యంగా ఉంటుందని పలువురు రైతులంటున్నారు.

ఉపాధి లేక.. ఊరిలో ఉండలేక..

- క్వారీ, క్రషర్లలో యంత్రాల వినియోగం
- ఉపాధి కోల్పోతున్న కార్మికులు
- పొట్ట నింపుకోవడానికి వలసలు
- పది గ్రామాల్లో మూడు వేలకు పైగా కార్మికుల అవస్థలు



ఉప్పంపాలెంలో యంత్రాలతో నిర్వహిస్తున్న నల్లరాయి క్వారీ



ఎస్.పైడిపాలలో యంత్రాలతో నిర్వహిస్తున్న స్టోన్ క్రషర్

రౌతులపూడి: ప్రస్తుతం సాంకేతిక రంగ అభివృద్ధి చెందడంతో అంతా యంత్రాలతోనే పనులు జరుగుతున్నాయి. యంత్రాల వినియోగం ఎక్కువగా ఉండడంతో కూలీలకు పనులు తగ్గుతున్నాయి. దీంతో వారు ఉపాధి కోల్పోతున్నారు. పొట్ట నింపుకోవడానికి పనులు ఉన్న పట్టణాలకు, ఇతర ప్రాంతాలకు వలసపోతున్నారు. కుటుంబాలకు దూరంగా ఉంటూ మండలంలో పారిశ్రామిక ప్రాంతంగా పేరొందిన ఎస్.పైడిపాల, మల్లంపేట, ములగపూడి, ఉప్పంపాలెం, మాతయ్యపేట తదితర గ్రామాల్లో ఏళ్ల కాలంగా నల్లరాయి క్వారీలు, క్రషర్లు నిర్వహిస్తున్నారు. ఆయా గ్రామాల్లో సుమారుగా 30కి పైగా నల్లరాయి క్వారీలు, 20 పైగా స్టోన్ క్రషర్లు ఉన్నాయి. ఆయా క్వారీలు, క్రషర్లలో చుట్టు పక్కల గ్రామాలైన ఎస్.పైడిపాల, మల్లంపేట, ములగపూడి, ఉప్పంపాలెం, గుమ్మరేగుల, రౌతులపూడి, బలరామపురం, మాతయ్యపేట, జల్దాం, అంపాడ, గ్రామాలకు చెందిన సుమారు మూడు వేలకు పైగా కార్మికులు పని చేసి జీవనం సాగిస్తున్నారు. ప్రస్తుతం కూలీల ఖర్చును తగ్గించకోవడం కోసం క్వారీ, స్టోన్‌క్రషర్ల యజమానులు ఆయా పనులను యంత్రాల ద్వారా నిర్వహిస్తున్నారు. దీంతో కార్మికులకు పనిలేకుండా పోయింది. ఆయా గ్రామాల్లో పనులు లేకపోవడంతో ఇతర గ్రామాలు, పట్టణాలకు వందలాది మంది కార్మికులు వలసపోతున్నారు.

క్వారీలో పనులు ఇలా

గతంలో నల్లరాయి క్వారీల్లో బ్లాస్టింగ్ చేసిన పెద్ద పెద్ద బండరాయిలను బోలర్ సైజు, 40 ఎంఎం, 30 ఎంఎం వంటి సైజుల్లో కార్మికులు తయారు చేసేవారు. బోలర్ సైజులను మగ కార్మికులు, 40 ఎంఎం, 30 ఎంఎం వంటి రోడ్డు మెటల్‌కు సంబంధించిన సైజులను ఆడవారు తయారు చేసేవారు. బోలర్ సైజులను స్టోన్ క్రషర్లకు ఎగుమతి చేసి వాటిని గృహనిర్మాణాలకు, ఇతర భవన నిర్మాణాలకు, రహదారులు, వంతెనలు నిర్మాణాలకు సంబంధించి వివిధ సైజులను క్రషర్లలో తయారు చేసేవారు. మగవారికి రూ.500 నుంచి రూ.800 వరకు వేతనం అందేది. ఆడ వారికి రూ.300 నుంచి రూ.500 వరకు వచ్చేవి. ప్రస్తుత ఆధునిక ప్రపంచంలో సాంకేతికంగా అభివృద్ధి చెందడంతో ఆయా పనులను ప్రొక్లెయిన్, జేసీబీ, బుల్, క్రేన్‌లు వంటి యంత్రాలతో నిర్వహిస్తున్నారు. దీంతో కార్మికులకు పని లేకుండా పోతోంది. ఎన్నో ఏళ్లుగా క్వారీలను, క్రషర్లలో పనిచేసి జీవనం సాగించే కార్మికులు జీవనాధారం లేకుండాపోతోంది. దీంతో వారు ఉపాధి లేక ఇబ్బంది పడుతున్నారు. యంత్రాల వల్ల ఉపాధి కోల్పోయామని కార్మికులు వాపోతున్నారు.

పనులు లేకపోవడంతో...

స్థానికంగా ఉన్న నల్లరాయి క్వారీలు, క్రషర్లలో అలవాటైన పనులు లేకపోవడంతో ఇతర ప్రాంతాల్లో వ్యవసాయేతర పనులు చేపట్టేందుకు ఆయా గ్రామాల్లోని కార్మికులు వలస వెళ్లే పరిస్థితులు నెలకొన్నాయి. ఇతర ప్రాంతాల్లోని వ్యవసాయం, ఇటుక బట్టీలు, చెరకు పనులు, యూకలిప్టస్, సరుగుడు తోటల పనులకు వెళ్లి నెలలు కాలంగా కుటంబాలను వీడి జీవనం సాగించాల్సివస్తోందని కూలీలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా స్థానికంగా ఉన్న నల్లరాయి క్వారీలు, క్రషర్లలో స్థానికులకు పనులు కల్పించాలని కూలీలు కోరుతున్నారు.

పని లేక ఇబ్బంది పడుతున్నాం



స్థానికంగా ఉన్న క్వారీలు, క్రషర్లలో పనులు లేక ఇబ్బంది పడుతున్నాం. ఇక్కడే ఏళ్ల తరబడి చేసుకుటున్న పని వదిలి వేరే ఊరు వెళ్లలేక, వేరే పనులు అలవాటు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. క్వారీల్లో పని చేసే కార్మికులు వ్యవసాయేతర పనులు కోసం ఇతర ప్రాంతాలకు వలస వెళ్లే పరిస్థితులు ఉన్నాయి. దీంతో నెలలు కాలంగా కుటుంబాలకు దూరంగా ఉండే దుస్థితి నెలకొంది. అధికారులు స్పందించాలి. క్వారీలు, క్రషర్లలో పనులు కల్పించాలి.

–కొరుప్రోలు శ్రీను, ఎస్.పైడిపాల, క్వారీ కార్మికుడు

ప్రజా ప్రతినిధులను పట్టించుకోరా ?

- అధికారుల తీరుపై కౌన్సిల్ ఆగ్రహం
- 32 అంశాల్లో 2 మాత్రమే ఆమోదం
- వాకౌట్ చేసిన కౌన్సిలర్లు



మున్సిపల్ చైర్‌పర్సన్ సుధారాణి



సమావేశంలో అధికారులను ప్రశ్నిస్తున్న కౌన్సిలర్లు

తుని: ప్రజల చేత ఎన్నికైన కౌన్సిలర్లకు కనీస గౌరవం ఇవ్వక పోవడం, పట్టణంలో చేసే పనుల వివరాలను తెలియజేయకపోవడంపై అధికారులపై కౌన్సిలర్లు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. సోమవారం తుని కౌన్సిల్ సమావేశం చైర్‌పర్సన్ ఏలూరి సుధారాణి అధ్యక్షతన జరిగింది. సాధారణ, అత్యవసర సమావేశాలకు సంబంధించి 32 అంశాలతో అజెండాను ప్రవేశపెట్టారు. ఇందులో కేవలం రెండు అంశాలను ఆమోదించి, 30 అంశాలను తిరస్కరించారు. కౌన్సిలర్ల దృష్టికి అంశాలను రాకుండా కలెక్టర్ చెప్పారని చేశామని అధికారులు చెప్పడం సమంజం కాదన్నారు. కమిషనర్ వెంకట్రావు, డీఈఈ ప్రకాశరావు కౌన్సిల్ సభ్యుల మధ్య వాడీవేడి చర్చ జరిగింది. అధికారుల సమాధానంతో సంతృప్తి చెందని కౌన్సిలర్లు సమావేశం నుంచి వాకౌట్ చేశారు.

ఆరు నెలలుగా అదే తంతు

ప్రభుత్వం వచ్చిన ఆరు నెలలు అవుతుందని, అప్పటి నుంచి అధికారులు ఏక పక్షంగా వ్యవహరిస్తున్నారని కౌన్సిలర్లు షేక్ ఖ్వాజా, కర్రి సత్య జగదీష్, పులి సత్యనారాయణ ఆరోపించారు. ప్రజలకు సంబంధించిన అభివృద్ధి పనులు, సమస్యలు స్థానిక కౌన్సిలర్ ద్వారా అజెండాలో పొందిపరచాలన్నారు. చట్టంలో పొందు పరిచిన నిబంధనలను బేఖాతరు చేస్తూ అధికారులు ఇష్టా రాజ్యంగా వ్యవహరించడం పరిపాటిగా మారిందని ధ్వజమెత్తారు. బెల్లపు వీధిలో కల్వర్టు నిర్మాణ విషయం ఎవరికి తెలియకుండా ఎందుకు చేపట్టారని కమిషనర్ వెంకట్రావును ప్రశ్నించారు. అత్యవసర పనుల విషయంలో కలెక్టర్ అనుమతితో చేయవచ్చునని సమాధానం చెప్పారు. దీంతో ఆగ్రహించిన కౌన్సిలర్లు కలెక్టర్ చేయమని చెప్పినట్టు అనుమతి పత్రాలను చూపించాలని డిమాండ్ చేశారు. రెండో వార్డులో మంచినీటి పైపులైన్ నిర్మాణ పనులు ఎంత వరకు వచ్చాయని కౌన్సిలర్ చింతల సునీత ప్రశ్నించారు. దీనికి డీఈఈ ప్రకాశరావు సమాధాన చెబుతూ జాతీయ రహదారి నుంచి పైపులైన్ వేయాలని, ఇందుకు అనుమతి రావాల్సి ఉందన్నారు. అధికారులు నిబంధనల మేరకు పని చేయాలని లేకపోతే ఇబ్బందులు తప్పవని సీపీ సుధారాణి హెచ్చరించారు. పట్టణాన్ని అభివృద్ధి చేయడానికి కౌన్సిల్ సంపూర్ణ మద్దతు ఇస్తుందన్నారు. అధికారులు, కౌన్సిల్ సభ్యులు కలిసి పని చేస్తేనే ప్రజల సమస్యలకు పరిష్కారం లభిస్తుందన్నారు. పలువురు కౌన్సిలర్లు స్థానిక సమస్యలను సమావేశం దృష్టికి తీసుకువచ్చారు. అధికారులు, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ శ్రేణుల్లో ఉత్సాహం

కొత్త సంవత్సర వేడుకల్లో 'ముద్రగడ'



ముద్రగడ గిరిబాబు

కిర్లంపూడి: ప్రత్తిపాడు నియోజకవర్గంలో వైఎస్సార్ సీపీ శ్రేణుల్లో ఉత్సాహం ఉరకలు వేస్తోంది. ఇటీవల సాగు సమస్యలు, పెంచిన విద్యుత్ బిల్లులపై పార్టీ అధిష్ఠానం పిలుపుతో నిర్వహించిన నిరసన కార్యక్రమాలు నియోజకవర్గంలో విజయవంతం కావడంతో పార్టీ నేతలు, కార్యకర్తల్లో జోష్ నింపింది. ఇదే స్ఫూర్తిని కొనసాగించి మరింత ముందుకు వెళ్లేందుకు కొత్త సంవత్సరంలో ముద్రగడ తీసుకున్న నిర్ణయం కూడా దోహదం చేస్తోందంటున్నారు. గత కొన్ని సంవత్సరాలుగా మాజీ మంత్రి ముద్రగడ పద్మనాభం నూతన సంవత్సర వేడుకలకు కారణాంతరాలతో దూరంగా ఉంటున్నారు. అటువంటి ముద్రగడ ఈ సారి నూతన సంవత్సర వేడుకల్లో కిర్లంపూడిలో అందుబాటులో ఉండడానికి నిర్ణయించారు. ఈ అంశంతోపాటు పార్టీ అధ్యక్షుడు జగన్ మోహన్‌రెడ్డి ముద్రగడ తనయుడు గిరిబాబును నియోజకవర్గ పార్టీ కోఆర్డినేటర్‌గా ఇటీవల నియమించడం పార్టీ శ్రేణుల్లో ఉత్తేజాన్ని, కొండంత ధైర్యాన్ని నింపాయి. కూటమి సర్కార్ గద్దె నెక్కిన ఆరు నెలలు తిరగకుండానే నెలకొన్న వ్యతిరేకతను ప్రజల్లోకి తీసుకువెళ్లాలని, ఇందుకు కోఆర్డినేటర్‌గా గిరిబాబుకు రావడం శుభపరిణామంగా విశ్లేసిస్తున్నారు. ఈ క్రమంలో నూతన సంవత్సర వేడుకలకు కిర్లంపూడిలో ముద్రగడ ఏర్పాట్లు చేస్తున్నారు. గ్రామాల వారీగా ఎంత మంది రానున్నారనే సమాచారాన్ని సోమవారం నాటికే అందించారు. ఇందుకు తగ్గట్టుగా భారీ ఏర్పాట్లు చేస్తున్నారు. గ్రామాల్లో ఫ్లెక్సీలు ఏర్పాటు చేసే విషయంలో ఎవరితోనూ వివాదాలకు దిగవద్దని ఇప్పటికే గిరిబాబు నేతలకు సూచించారు. ఉద్యమాలతో హోరెత్తిన కిర్లంపూడిలో తాజా పరిణామాలతో రాజకీయ సందడి కనిపిస్తోంది.

ప్రతి కార్యకర్తకూ అండగా ఉంటా

- దాడులు సరికాదు, అధికారం ఎవరికీ శాశ్వతం కాదు
- వైఎస్సార్ సీపీ ప్రత్తిపాడు ఇన్‌చార్జి ముద్రగడ గిరిబాబు భరోసా



కిర్లంపూడిలో ముద్రగడను, గిరిబాబును కలిసిన మండపం నేతలు

కిర్లంపూడి: దాడులు సరికాదని, అధికారం ఎవరికి శాశ్వతం కాదని, ప్రత్తిపాడు నియోజకవర్గంలోని ప్రతి కార్యకర్తకు, ప్రజలకు అండగా ఉంటానని వైఎస్సార్ సీపీ ప్రత్తిపాడు నియోజకవర్గం ఇన్‌చార్జి ముద్రగడ గిరిబాబు భరోసా ఇచ్చారు. కిర్లంపూడిలోని మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ నేత ముద్రగడ పద్మనాభం నివాసంలో మండపం సర్పంచ్ కూనిశెట్టి మాణిక్యం ఆధ్వర్యంలో సోమవారం పార్టీ నాయకులు భారీగా తరలివచ్చి గిరిబాబును మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా గిరిబాబు మాట్లాడుతూ ఇటీవల శంఖవరం మండలం మండపంలోని దాడికి గురైన వైఎస్సార్ సీపీ కార్యకర్తలకు అండగా నిలుస్తామన్నారు. పార్టీ శ్రేణులు, యువత అధైర్యపడొద్దని భరోసా ఇచ్చారు. అధికారం అండతో దాడులకు పాల్పడిన వారిపై న్యాయపరమైన పోరాటం చేద్దాం. వైస్‌ప్రెసిడెంట్ నక్కా మాణిక్యం, అల్లు అప్పలరాజు, సొప్ప అర్జున్, మాజీ ఎంపీటీసీ బి.అర్జునరావు, కూనిశెట్టి యపారియ్య, మండల కన్వీనర్ నరాల శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

రాష్ట్రస్థాయి క్రీడా పోటీల్లో విద్యార్థుల ప్రతిభ



పాఠశాలలో గెలుపొందిన విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేస్తున్న ఉపాధ్యాయులు

కిర్లంపూడి: కాకినాడ–జేఎన్‌టీయూలో నిర్వహించిన రాష్ట్రస్థాయి క్రీడా పోటీల్లో కిర్లంపూడి కొక్కొండ రామశేషగిరిరావు పంతులు ప్రభుత్వోన్నత పాఠశాల విద్యార్థులు ఉత్తమ ప్రతిభను కనబరిచి ప్రథమ, తృతీయ స్థానాల్లో నిలిచారు. సీనియర్ విభాగం నుంచి తొమ్మిదో తరగతి విద్యార్థిని జి.హేనీ 'స్టోరీ టెల్లింగ్'లో ప్రథమ స్థానం, 8వ తరగతి చదువుతున్న వై.మంగ ఏకపాత్రాభినయంలో తృతీయ స్థానం సాధించారు. జూనియర్ విభాగం నుంచి క్విజ్ పోటీల్లో ఆడారి సోమేశ్వరి, కాళ్ల సరియు ప్రశాంతి, జి.సోనీ బృందం తృతీయ స్థానంలో నిలిచారు. పాఠశాల ఇన్‌చార్జి హెచ్‌ఎం ప్రకాశరావు ఆధ్వర్యంలో సోమవారం విజేతలకు సర్టిఫికెట్లను అందజేశారు. విద్యా కమిటీ చైర్మన్ ఆళ్ల బాబులు, మాజీ విద్యా కమిటీ చైర్మన్ దాడి గోవిందు, ఉపాధ్యాయులు, స్థానిక నాయకులు విద్యార్థులను అభినందించారు.

రమణ తత్వంతో మానసిక ప్రశాంతత



అరుణాచలేశ్వరస్వామిని దర్శించుకుంటున్న భక్తులు

ప్రత్తిపాడు రూరల్: రమణ తత్వంతో మానసిక శాంతి, సమాజానికి మేలు చేకూరుతుందని శ్రీవిద్యా పీఠం పీఠాధిపతి వాసుదేవానందగిరి స్వామి అన్నారు. రాచపల్లి శ్రీరమణా సేవాశ్రమంలో స్వామి రామానంద, స్వామి లక్ష్మానంద స్వాముల ఆధ్వర్యంలో రమణ మహర్షి 145వ జయంతిని ఆలయ కమిటీ వైభవంగా నిర్వహించింది. ఈ సందర్భంగా డీవీఎస్ రాజు అధ్యక్షతన ఆధ్యాత్మిక సభ నిర్వహించారు. ఈ సందర్భంగా కాకినాడ ఆది గురు యోగపీఠ పీఠాధిపతి సద్గురు సచ్చిదానంద యోగి, శాంతి ఆశ్రమం మాతాజీ వినమ్రానంద సరస్వతి మాతాజీ, వంగలపూడి సద్గురు సేవాశ్రమం పీఠాధిపతి నిర్వాణానంద మాతాజీ, లలిత గీతాశ్రమం పీఠాధిపతి విజ్ఞానానందగిరి మాతాజీ ముఖ్య అతిథులుగా హాజరై భక్తులను ఉద్దేశించి ప్రసంగించారు. ఆధ్యాత్మిక మార్గంలో భగవంతుడిని దర్శించినప్పుడే నిజమైన శాంతి కలుగుతుందన్నారు. అనంతరం ఆలయ ప్రాంగాణంలో అన్నసంతర్పణ నిర్వహించారు. వేడుకలను తిలకించేందుకు రాష్ట్ర నలుమూల నుంచి భారీ ఎత్తున భక్తులు తరలివచ్చి స్వామి వారిని దర్శించుకున్నారు. రాచపల్లి వెళ్లే ప్రధాన రహదారి భక్తులతో కిటకిటలాడింది. దీంతో ట్రాఫిక్‌కు అంతరాయం కలిగింది. ప్రత్తిపాడు సీఐ సూర్యఅప్పారావు పర్యవేక్షణలో స్థానిక ఎస్సై లక్ష్మీకాంతం పోలీసు సిబ్బందితో కలిసి బందోబస్తు నిర్వహించారు. కార్యక్రమంలో ఎరకంపాలెం శ్రీస్కందదేశికాశ్రమం పీఠాధిపతి స్వామి లక్ష్మానంద, ప్రణవ జ్యోతిషాలయం కర్రా వీరభద్రం, మాజీ ఎమ్మెల్యే వరుపుల సుబ్బారావు, వైస్ ఎంపీపీ ఏనుగు శ్రీను, బుద్ధరాజు చంటిరాజు, బుద్ధరాజు గోపిరాజు తదితరులు పాల్గొన్నారు.

రమణ మహర్షి జీవితం ఆదర్శనీయం

తుని రూరల్: భగవాన్ రమణ మహర్షి జీవితం ఆచరణీయమని జేఎన్‌టీయూకే డైరెక్టర్ ప్రొఫెసర్ పలివెల సుబ్బారావు అన్నారు. సోమవారం జగన్నాథగిరి శివారు కాలనీ సరస్వతీ విద్యా సేవ సమితి ఆధ్వర్యాన ఆశ్రమం ప్రాంగణంలో రమణ మహర్షి జయంతి మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సత్సంగ కార్యక్రమంలో సుబ్బారావు ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిడారంబరతకు నిలువుటద్దం భగవాన్ రమణ మహర్షి అన్నారు. సమాజంలో వ్యక్తులు, వ్యవస్థల మధ్య నిత్యం సత్సంబంధాలు ఏర్పాటు చేసుకుని సమానత్వంతో సుఖ జీవనాన్ని సాగించాలన్నారు. భక్తులకు రమణ మహర్షి జీవిత విశేషాలను వివరించారు. జయంతిని పురస్కరించుకుని హోమం, పూర్ణాహుతి, అన్న సమారాధనలు నిర్వహించారు. సేవా సంస్థ వ్యవస్థాపకులు గొర్లి శివరామకృష్ణ, తుని, పరిసర ప్రాంతాలకు చెందిన భక్తులు పాల్గొన్ని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

అడినషల్ కోర్టు మంజూరు చేయాలి

ప్రత్తిపాడు: స్థానిక ప్రత్తిపాడు జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ కోర్టులో కేసులను త్వరితగతిన పరిష్కారం కోసం అడిషనల్ కోర్టు మంజూరు చేయాలని బార్ అధ్యక్షుడు రాజాల చిట్టిబాబు కోరారు. ఈ మేరకు సోమవారం సాయంత్రం అమరావతిలో తూర్పు గోదావరి జిల్లా పోర్టు పోలియో జడ్జి ఎన్.జయసూర్యను ప్రత్తిపాడు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు రాజాల చిట్టిబాబు కలిసి వినతి పత్రం అందజేశారు. ప్రత్తిపాడు బార్ ప్రతినిధులు పలివెల నాగేంద్రరాజు, ఏకేఎస్ మల్లేశ్వరరావు, బి.అశోక్ కుమార్, ఆర్‌వైఆర్ శాస్త్రి పాల్గొన్నారు.

సత్యదేవుని దర్శించిన పోలీస్ కమ్యూనికేషన్ ఎస్పీ



కమ్యూనికేషన్ ఎస్పీ సూర్యకుమార్ దంపతులకు వేదాశీస్సులు అందచేస్తున్న పండితులు

అన్నవరం: రాష్ట్ర పోలీస్ కమ్యూనికేషన్ విభాగం ఉత్తరాంధ్ర, కోస్తా జిల్లాల ఎస్పీ సూర్యకుమార్ కుటుంబ సభ్యులతో కలిసి సోమవారం రత్నగిరిపై సత్యదేవుని దర్శించి పూజలు చేశారు. వారికి ఆలయం వద్ద పండితులు ఘనంగా స్వాగతం పలికారు. స్వామివారి దర్శనం అనంతరం వేదపండితులు వేదాశీస్సులు అందజేయగా, స్వామివారి ప్రసాదాలను ఏఈఓ డీవీ కృష్ణారావు అందించారు. స్థానిక కమ్యూనికేషన్ ఏఎస్ఐ ప్రసాద్, హెడ్ కానిస్టేబుల్ శివప్రసాద్, ప్రొటోకాల్ ఆఫీసర్ రాంబాబు తదితరులు వారి వెంట ఉన్నారు.

తమ్మన్నదొరకు ఆదర్శ రైతు అవార్డు



ఆదర్శ రైతు అవార్డు అందుకుంటున్న దాసరి తమ్మన్నదొర

గోకవరం: గ్రామానికి చెందిన విశాల సహకార పరపతి సంఘం మాజీ అధ్యక్షుడు దాసరి తమ్మన్నదొర పామాయిల్ సాగులో ఆదర్శ రైతు అవార్డు అందుకున్నారు. ఆదివారం రాజానగరం మండలం ఒడిసిలేరు గ్రామం వద్ద జీఎస్ఎల్ మెడికల్ కళాశాల అధినేత గన్ని భాస్కరరావు ఆధ్వర్యంలో రైతులను ప్రోత్సహించేందుకు ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పతంజలి ఆయిల్స్ ప్రైవేట్ లిమిటెడ్ వారు అందజేసిన పామాయిల్ సాగు రైతుల వివరాల ప్రకారం పామ్ ఆయిల్ సాగులో అత్యధిక దిగుబడి సాధించిన రైతులకు అవార్డులు అందజేశారు. దీనిలో భాగంగా తమ్మన్నదొర జీఎస్ఎల్ మెడికల్ కళాశాల అధినేత డాక్టర్ గన్ని భాస్కరరావు, శాసనసభ ఉపసభాపతి రఘురామ కృష్ణంరాజు చేతుల మీదుగా ఈ అవార్డు అందుకున్నారు. ఈ సందర్భంగా ఆయన్ను మండలంలోని వివిధ పార్టీలకు చెందిన నాయకులు, పలువురు అధికారులు అభినందించారు.

న్యూ ఇయర్ వేడుకలు ప్రశాంతంగా జరుపుకోండి



బి.సూర్య అప్పారావు, సీఐ, ప్రత్తిపాడు

ప్రత్తిపాడు: నూతన సంవత్సర వేడుకలను వివాదాలు, ఘర్షణలకు తావు లేకుండా జరుపుకోవాలని ప్రత్తిపాడు సీఐ బి.సూర్య అప్పారావు సూచించారు. సోమవారం సాయంత్రం ఆయన మాట్లాడుతూ 2024కు వీడ్కోలు పలుకుతూ 2025 సంవత్సరానికి స్వాగతం పలికే వేడుకలను పరిమితికి లోబడి చేసుకోవాలన్నారు. రోడ్లపై కేక్ కటింగ్ పూర్తిగా నిషేధించామని, డీజే లాంటి భారీ శబ్దాలకు అనుమతి లేదని స్పష్టం చేశారు. హోటళ్లు, మద్యం దుకాణాలు, రెస్టారెంట్లు, దుకాణాలు, వ్యాపార సంస్థలు నిర్ణీత సమయానికే మూసేయాలన్నారు. అనుమతి లేని ప్రదేశాల్లో మద్యం సేవించి, ఇతరులను ఇబ్బంది పెడితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. ఈ రోజు సాయంత్రం నుంచి ముఖ్య ప్రదేశాలలో చెక్ పోస్టులు ఏర్పాటు చేసి, తనిఖీలు నిర్వహిస్తామన్నారు. ప్రత్యేక బృందాలతో డ్రంక్ అండ్ డ్రైవ్ కొనసాగిస్తామని చెప్పారు. బైక్ రేసులు, త్రిబుల్ రైడింగ్, మైనర్ల రైడింగ్‌పై ప్రత్యేక దృష్టి సారించామన్నారు. మద్యం మత్తులో ప్రభుత్వ, ప్రైవేటు ఆస్తులకు నష్టం చేకూర్చరాదన్నారు. 31వ తేదీ అర్ధ రాత్రి వరకు 30 యాక్ట్ అమలులో ఉంటుందని, ఎవరైనా హద్దు మీరితే కఠినంగా వ్యవహరిస్తామని హెచ్చరించారు. నూతన సంవత్సర వేడుకలకు పిల్లలను బయటకు పంపవద్దన్నారు. ప్రతి ఒక్కరూ ఇంట్లోనే నూతన సంవత్సర వేడుకలు జరుపుకోవాలని ప్రత్తిపాడు సీఐ సూర్య అప్పారావు కోరారు.

అగ్ని ప్రమాద ఘటనస్థలి పరిశీలన



జగన్నాథపురంలో వరికుప్ప దగ్ధమైన ప్రాంతాన్ని పరిశీలిస్తున్న సీఐ చెన్నకేశవరావు

కోటనందూరు: అగ్ని ప్రమాద ఘటనా స్థలిని తుని రూరల్ సీఐ జీ చెన్నకేశవరావు, ఎస్సై రామకృష్ణ సోమవారం పరిశీలించారు. జగన్నాథపురం గ్రామానికి చెందిన బంగారు కొండబాబుకు చెందిన రెండెకరాల్లో వరికుప్పకు ఆదివారం రాత్రి గుర్తు తెలియని దుండగులు నిప్పంచిన విషయం విదితమే. సీఐ చెన్నకేశరావు, ఎస్సై రామకృష్ణ ఘటనాస్థలిని సందర్శించి ఎవరైనా ఉద్దేశపూర్వకంగా తగలబెట్టారా? ప్రమాదవశాత్తు జరిగిందా? అనే కోణాల్లో విచారణ చేపట్టారు. ఎవరైనా అనుమానితులు ఉన్నారా? ఎవరితోనైనా గొడవలు ఉన్నాయా? అని బాధిత రైతు కుటుంబ సభ్యులను ప్రశ్నించారు. సమగ్ర దర్యాప్తు చేపట్టి నిందితులను పట్టుకుంటామని పోలీసులు హామీ ఇచ్చారు.

బాలికల సంరక్షణపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి



పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఎంపీపీ గొల్లపల్లి బుజ్జి, అధికారులు

ఏలేశ్వరం: బాలికల సంరక్షణపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఎంపీపీ గొల్లపల్లి బుజ్జి అన్నారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో సోమవారం ఐసీడీఎస్ ఆధ్వర్యంలో కిషోర వికాసం–మండల స్థాయి శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఎంపీపీ మాట్లాడుతూ బాలికల సంరక్షణకు ప్రభుత్వాలు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నాయన్నారు. బాల్య వివాహాలు లేని రాష్ట్రంగా తీర్చిదిద్దాలన్నారు. అనంతరం కిషోర వికాసం పోస్టర్లను ఆవిష్కరించారు. ఎంపీడీఓ సూర్యనారాయణ, ఎంఈఓ వరలక్ష్మి, ప్రభుత్వ వైద్యురాలు శ్రీలక్ష్మీ, ఎస్సై రామలింగేశ్వరరావు, హెచ్‌ఎంలు, ఏఎన్‌ఎంలు, డ్వాక్రా వీఓలు పాల్గొన్నారు.